క్లుప్తంగా

ఘనంగా బుద్ధ జయంతి



మండవల్లి: గౌతమ బుద్ధుడు నేర్పిన శాంతి సహనం, అహింస, జాలి, దయ మార్గాలకు అనుగుణంగా నేటి యువత నడవాలని ఐక్య వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్ఎస్ భాస్కర రావు, అసోసియేషన్ అధ్యక్షుడు శాంతరాజు అన్నారు. బౌద్ధ మత స్థాపకుడు బుద్ధుడి జయంతి పురస్కరించుకుని అంబేడ్కర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద సోమవారం ఆయన చిత్రపటానికి పూలమాల వేశారు. అసోసియేషన్ కార్యదర్శి కొండపల్లి రవివర్మప్రసాద్, ముఖ్య సలహాదారు గోరింక గాంధీ మాట్లాడుతూ బుద్ధుడు నేర్పిన శాంతి, సహనం, అహింస మార్గాలు ప్రపంచానికి ఆదర్శమన్నారు. గాజులపల్లి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వేణుగోపాల స్వామి గ్రామోత్సవం



పామర్రు: స్థానిక శ్రీరుక్మిణీ సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామివారి కల్యాణమూర్తుల గ్రామోత్సవం సోమవారం వైభవంగా నిర్వహించారు. తొలుత ఆలయంలో స్వామివార్లకు విశేష పూజలు చేశారు. గ్రామ పురవీధుల్లో మేళతాళాలతో స్వామివార్లను పల్లకీపై ఊరేగించారు. ఆలయ అర్చకుడు రొంపిచర్ల ముకుంద భార్గవ ఆధ్వర్యంలో పూజలను చేశామని ఆలయ మేనేజర్ జన్ను వెంకటేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది కే ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ నర్సుల దినోత్సవం



పామర్రు: స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వద్ద అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఏపీ ఎన్జీవోస్ పామర్రు తాలూకాలోని ఉమెన్ వింగ్స్ అధ్యక్షురాలు అనసూయ, ఉమా మహేశ్వరీలను సన్మానించారు. ఈ సందర్భంగా పామర్రు తాలూకా అధ్యక్ష కార్యదర్శులు నగేష్, రాములు మాట్లాడుతూ ఫ్లోరెన్స్ నైటింగేల్ పుట్టిన రోజును పురస్కరించుకుని అంతర్జాతీయ నర్సుల దినోత్సవం జరుపుకొంటున్నట్లు తెలిపారు. రోగులకు ఉత్తమమైన సేవలు చేస్తున్న నర్సుల సేవలను మనమందరం గుర్తించుకోవాలని సూచించారు. అనంతరం నర్సులను సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా వైస్ ప్రెసిడెంట్ ఫరీద్ భాషా, కార్యవర్గ సభ్యులు ప్రేమ్, పీడీవీ కుమార్, నర్సులు పాల్గొన్నారు.

విషపు గుళికలు తిని 18 మేకలు మృతి



పెదసనగంటిపాలెం(మొవ్వ): విషపు గుళికలు తిని 18 మేకలు మృతిచెందిన సంఘటన ఆదివారం రాత్రి జరిగింది. సేకరించిన వివరాల మేరకు.. మొవ్వ మండలం పెదసనగల్లు శివారు పెదసనగంటి పాలెం(మృత్రాసి పాలెం) చెందిన పేరం విజయ్ పదిహేను మేకలు, సుబ్రహ్మణ్యం ఐదు మేకలను సుమారు ఏడాది క్రితం కొనుగోలు చేశారు. మేతకు పొలాల్లో మేపుతున్న క్రమంలో జీవాలు విషపు గుళికలు(గులుకుల మందు) తిన్నాయి. రాత్రి ఇంటికి వచ్చిన కొంత సేపటికే ఒక్కొక్కటి చనిపోయాయి. సుబ్రహ్మణ్యంకు చెందిన రెండు మేకలు మాత్రమే బతికాయి. ప్రభుత్వం సాయం చేసి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

వ్యభిచార గృహంపై పోలీసుల దాడి

గుడివాడరూరల్: వ్యభిచార గృహంపై పోలీసులు దాడి చేసి ఇద్దరు నిందితులను సోమవారం అదుపులోకి తీసుకున్నారు. గుడివాడ తాలూకా ఎస్ఐ ఎన్ చంటిబాబు మీడియాతో మాట్లాడుతూ మండలంలోని వలివర్తిపాడు గ్రామ పరిధిలోని అరుంధతి కాలనీలో ఒక ఇంట్లో వ్యభిచార కేంద్రం నిర్వహిస్తున్నారన్న సమాచారంతో దాడి చేసి నిర్వాహకురాలు కొండ్రు నాగజ్యోతితో పాటు శ్రీకాళహస్తీ కాలనీకి చెందిన రావడి శ్రీనివాస్, ఒక మహిళ బాధితురాలిని, విటుడిని అరెస్ట్ చేశామన్నారు. నిందితులను కోర్టులో హాజరుపర్చగా 14రోజులు రిమాండ్ విధించినట్లు తెలిపారు.



తోట్లవల్లూరు పంచాయతీ కార్యాలయం వద్ద అధ్వానంగా రోడ్డు



కనకదుర్గమ్మ కాలనీ వద్ద రోడ్డుపై గుంతలు

ప్రయాణం... నరకప్రాయం

- తోట్లవల్లూరులో అధ్వానంగా ఆర్అండ్‌బీ రోడ్డు
- అభివృద్ధి చేయాలని కోరుతున్న ప్రజలు



మండల పరిషత్ పాఠశాల వద్ద రోడ్డు దుస్థితి

తోట్లవల్లూరు: తోట్లవల్లూరు గ్రామంలోని ప్రధాన రహదారి అధ్వానంగా మారింది. గుంతలమయంగా మారిన ఈ రహదారితో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డుపై ప్రయాణం వాహనదారులకు నరకప్రాయాన్ని తలపిస్తోంది. వివరాల్లోకి వెళితే.. తోట్లవల్లూరు - ఉయ్యూరు ఆర్అండ్‌బీ రోడ్డు అధ్వానంగా తయారైంది. కేఈబీ కాలువ వంతెన వద్ద నుంచి కనకదుర్గమ్మ కాలనీ వద్ద ఉన్న పెట్రోల్ బంకు వరకు రోడ్డు బాగా దెబ్బతిని గుంతలమయంగా మారింది. సుమారు రెండున్నర కిలోమీటర్ల పొడవున రహదారి గోతులు పడటంతో రోడ్డుపై రాకపోకలు సాగించే వారికి చుక్కలు చూపిస్తోంది.

మొక్కుబడిగా మరమ్మతులు

సుమారు రూ. 40 లక్షల వ్యయంతో తోట్లవల్లూరు - ఉయ్యూరు ఆర్అండ్‌బీ రోడ్డుకు ఇటీవల మరమ్మతులు నిర్వహించారు. ఉయ్యూరు బస్టాండ్ నుంచి యాకమూరు మలుపు వరకు అక్కడక్కడా చిన్న చిన్న గోతులు పూడ్చారు. ఒక కిలోమీటరు పొడవున తారు రోడ్డును మాన్యువల్‌గా నిర్మించి పనులను ముగించేశారు. నిధులు అయిపోయాయనే సాకుతో రోడ్డు మరమ్మతులను పూర్తి చేయకుండా మధ్యలోనే వదిలేశారు.

రోడ్డుపై పెద్ద పెద్ద గోతులు

పెట్రోల్ బంక్ నుంచి కేఈబీ కాలువ వంతెన వరకు రోడ్డుపై పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి. వర్షం పడితే ఆయా గోతుల్లో పెద్ద ఎత్తున వర్షం నీరు నిలిచి ఉంటోంది. వర్షం నీటితో నిండిన గోతుల్లో ప్రయాణించలేక ద్విచక్రవాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఆ గోతుల్లో పడి గాయాలపాలవుతున్నారు. అలాగే ఇరువైపులా మెరక ఉండటంతో రోడ్డుపై నీరు కూడా త్వరగా బయటకు పోయే మార్గం లేకుండా పోయింది. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు పాడైపోయింది

తోట్లవల్లూరు మెయిన్ రోడ్డు బాగా దెబ్బతిని పాడైపోయింది. కేఈబీ కాలువ వంతెన నుంచి కనకదుర్గమ్మ కాలనీ వరకు ప్రయాణించాలంటే నరకం కనపడుతోంది. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి.

– నక్కా అంజయ్య, తోట్లవల్లూరు

నిధులు మంజూరు కావాలి

తోట్లవల్లూరులో ఆర్అండ్‌బీ రోడ్డు అభివృద్ధికి రూ. 3.50 కోట్లతో అంచనాలు రూపొందించి జిల్లా అధికారులకు పంపించడం జరిగింది. నిధులు మంజూరు అయిన వెంటనే టెండర్ ప్రక్రియ పూర్తి చేసి రోడ్డు అభివృద్ధికి చర్యలు తీసుకుంటాం.

– మల్లికార్జున, ఏఈఈ ఆర్అండ్‌బీ, ఉయ్యూరు

20న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

పామర్రు: కార్మిక వర్గాల హక్కులను కాపాడేందుకు ఈనెల 20వ తేదీన జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా నాయకుడు కే చంద్రపాల్ కోరారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో సోమవారం కార్మిక సంఘాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ లేబర్ కోడ్స్ రద్దు, కార్మికుల కనీస వేతన చట్టం అమలు, అసంఘటిత కార్మికులకు భద్రత వంటి సమస్యలపై కార్మికుల పక్షాన నిరసన తెలిపేందుకు ఈ నెల 20న మండల ప్రధాన కేంద్రాల్లో సమ్మె నిర్వహించనున్నట్లు తెలిపారు. మండల సీపీఎం కార్యదర్శి ఒడుగు గంగాధర ప్రసాద్, బిల్డింగ్ వర్కర్స్ జిల్లా నాయకులు వీ పెదబాబు, కేవీపీఎస్ జిల్లా నాయకుడు ముళ్లపూడి విల్సన్, మండల నాయకులు బరిగెల భీమేశ్వరరావు, ఇంతేటి రాజు, కౌలు సంఘ నాయకులు కే లక్ష్మణ తదితరులు పాల్గొన్నారు.



సమ్మె వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఆర్సీపీ రెడ్డి

గుడివాడరూరల్: స్థానిక సీపీఎం కార్యాలయంలో ఈనెల 20న తలపెట్టిన సమ్మె వాల్‌పోస్టర్లను కార్మిక సంఘాల నాయకులతో కలిసి సోమవారం సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్సీపీ రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ సమ్మెలో అన్నివర్గాల వారు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఐద్వా కార్యదర్శి పీ రజిని, కార్మికులు ఎల్ సురేంద్ర, పీ ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు

కురుమద్దాలి(పామర్రు): ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. మండలంలోని కురుమద్దాలి గ్రామంలో గల కల్యాణ మండపంలో సోమవారం ప్రగతి పథంలో పామర్రు అనే నియోజకవర్గ స్థాయి అధికారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. అనంతరం స్థానిక బీసీ కాలనీలో పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. జనసేన పార్టీ ఇన్‌ఛార్జి తాడిశెట్టి నరేష్, గ్రామ సర్పంచ్ గోట్రు విజయభారతి, కృష్ణా జిల్లా ప్రాజెక్టు కమిటీ వైస్‌చైర్మన్ వల్లూరిపల్లి గణేష్, టీడీపీ మండల అధ్యక్షుడు ప్రవీణ్‌చంద్ర, స్థానిక డీసీ చైర్మన్ కొసరాజు వెంకటేశ్వరరావు, నియోజకవర్గంలోని అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.



నియోజకవర్గ స్థాయి అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కుమార్ రాజా

బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహావిష్కరణ

నిభానుపూడి(పామర్రు): మండలంలోని నిభానుపూడి గ్రామంలో డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని సోమవారం ఎమ్మెల్యే కుమార్ రాజా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన జగ్జీవన్ రామ్ సేవలను కొనియాడారు. స్థానిక నాయకులు డెక్కా వీరాంజనేయులు, బీజేఆర్ యూత్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం

గుడ్లవల్లేరు: కొతవరం శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవ దేవస్థానం, శ్రీ గంగా పార్వతీ సమేత గౌతమేశ్వరాలయం, గుడ్లవల్లేరు శ్రీ రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామివారి ఆలయాల వార్షికోత్సవాలు సోమవారం కొనసాగాయి. స్వామివార్లకు బిందె తీర్థం, నిత్య అర్చన, బలిహరణ, నిత్య హోమం, పూర్ణాహుతి వేద మంత్రోచ్ఛరణ నిర్వహించారు. అలాగే వెణుతురుమిల్లి శ్రీ రామలింగేశ్వర స్వామివారి ఆలయం, శ్రీ కోదండ రామస్వామివారి ఆలయాల ఉత్సవాల్లో భాగంగా తీర్థపు బిందె, నిత్యోపాసన కార్యక్రమాలు జరిగాయి.



బొడ్డపాడులో వేణుగోపాలస్వామి

పాపవినాశనేశ్వరస్వామి కల్యాణం

పమిడిముక్కల: వైశాఖ పౌర్ణమి సందర్భంగా కపిలేశ్వరపురం లంకతోటలోని శ్రీపాపవినాశనేశ్వరస్వామివారి వార్షిక కల్యాణం సోమవారం జరిగింది. అర్చకులు గూడూరు శివరామకృష్ణప్రసాద్ స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నసంతర్పణ చేశారు.

వేణుగోపాలస్వామి కల్యాణోత్సవం

తోట్లవల్లూరు: తోట్లవల్లూరులోని శ్రీరుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి కల్యాణోత్సవం ఆదివారం రాత్రి జరిగింది. స్వామివారి వార్షిక కల్యాణోత్సవాల్లో భాగంగా ఆలయ కల్యాణ వేదికపై కొలువైన ఉత్సవమూర్తులకు వేదపండితులు శాస్త్రోక్తంగా ఎదుర్కోల ఉత్సవం, స్వామివారి కల్యాణం నిర్వహించారు. ఆలయ ఈఓ హరి దుర్గానాగేశ్వరరావు కార్యక్రమాలను పర్యవేక్షించారు.



తోట్లవల్లూరులో వేణుగోపాలస్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

తోట్లవల్లూరు: బొడ్డపాడులో వేణుగోపాలస్వామి కల్యాణోత్సవం ఆదివారం రాత్రి కనులపండువలా జరిగింది. అలాగే సోమవారం నిర్వహించిన స్వామివారి గ్రామోత్సవం మేళతాళాలతో సందడిగా సాగింది. ఆయా కార్యక్రమాల్లో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ ఈఓ సుపద్మాదేవి కల్యాణ మహోత్సవాన్ని పర్యవేక్షించారు.



పాపవినాశనేశ్వరస్వామి కల్యాణంలో పాల్గొన్న దంపతులు



కొతవరం చెన్నకేశవాలయంలో శ్రీలక్ష్మీనారాయణ కల్యాణం

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



తాడంకి హైస్కూల్‌లో గురువులతో 2000-01 బ్యాచ్ విద్యార్థులు

గుడ్లవల్లేరు: డోకిపర్రు వీరమాచినేని గంగాధరరావు ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 1989–91 తొమ్మిది, పది బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం సోమవారం నిర్వహించారు. 34 ఏళ్ల తర్వాత రెండు తెలుగు రాష్ట్రాల నుంచి 40మంది పూర్వ విద్యార్థులు హాజరయ్యారు. ఆనాటి ఉపాధ్యాయులు వీరరాఘవచారి, స్వర్ణలత, సరళాదేవి, కిషోర్‌కుమార్, నెహ్రూలాలను దుశ్శాలువాలతో సత్కరించారు.

తాడంకి జెడ్పీ హైస్కూల్‌లో...

పమిడిముక్కల: తాడంకి జెడ్పీ హైస్కూల్‌లో 2000–01 బ్యాచ్ పదవ తరగతి విద్యార్థులు 24 ఏళ్ల తర్వాత హైస్కూల్లో కలుసుకొన్నారు. ఒకరినొకరు పరిచయం చేసుకొని నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటపాటలతో ఉత్సాహంగా గడపారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సత్కరించి ఆశీర్వాదం తీసుకొన్నారు. అందరూ కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. పూర్వ విద్యార్థులు కంభపు లక్ష్మయ్య, కందుకూరి రఘునాథ్, కొల్లూరి నాగరాజు, కూచిపూడి రాంబాబు, వేల్పూరి బాలకృష్ణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.



ఆనాటి ఉపాధ్యాయులతో 1989-91 బ్యాచ్ విద్యార్థులు

వేసవి విజ్ఞాన శిబిరాలతో మేలు



అంగలూరులో పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు



మండవల్లిలో పిల్లలకు జనరల్ నాలెడ్జ్‌పై అవగాహన



జమీగొల్వేపల్లిలో వేసిన చిత్ర లేఖనాలు చూపుతున్న చిన్నారులు

గుడ్లవల్లేరు: వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా విద్యార్థులకు గ్రంథాలయాల్లో నిర్వహించే కార్యక్రమాల వల్ల ఎంతో మేలు చేకూరుతుందని అంగలూరు, గుడ్లవల్లేరు గ్రంథాలయాధికారులు పీవీవీ పద్మజ, వాణి అన్నారు. సోమవారం వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా విద్యార్థులకు పుస్తక పఠన పోటీలతో పాటు ఆటల పోటీలు, చిత్ర లేఖనం పోటీలను నిర్వహించారు.

విద్యార్థులకు నీతి కథలు

ముదినేపల్లి రూరల్: స్థానిక శాఖా గ్రంథాలయంలో సోమవారం విద్యార్థులతో నీతికథలు చదివించారు. లైబ్రేరియన్ ఎం శ్రీదేవి ఆధ్వర్యంలో విద్యార్థులతో కథలు చదివించి వాటి ప్రాముఖ్యతను తెలియజేశారు. అనంతరం చదరంగం, క్యారమ్స్, లూడో వంటి ఆటలు నిర్వహించారు.

జమీగొల్వేపల్లి(పామర్రు): మండల పరిధి జమీగొల్వేపల్లిలోని శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణలో భాగంగా సోమవారం విద్యార్థులకు చిత్ర లేఖనం పోటీలు నిర్వహించారు. చిత్ర లేఖనంలో ప్రతిభ కనబర్చిన వారికి మహిళా మండలి అధ్యక్షురాలు గుమ్మడి ఉషాదేవి బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు ఎస్ మాధవి, పీ పద్మావతి, గ్రంథాలయ అధికారి వీ నాగసురేష్, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



గ్రంథాలయంలో నీతికథలు చదువుతున్న విద్యార్థులు

పామర్రులో..

స్పోకెన్ ఇంగ్లిష్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించామని పామర్రు ద్వితీయ శ్రేణి గ్రంథాలయ అధికారి ఎం ఝాన్సీరాణి తెలిపారు. అనంతరం విద్యార్థులకు నీతి కథలు చదివించడం జరిగిందన్నారు. పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జనరల్ నాలెడ్జ్‌పై పట్టు సాధించాలి

మండవల్లి: జనరల్ నాలెడ్జ్‌పై పట్టు సాధించడం వల్ల పిల్లలకి కాంపిటేటివ్ స్పిరిట్ పెరుగుతుందని లైబ్రేరియన్ ఎస్‌కే పర్వీన తెలిపారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా సోమవారం జనరల్ నాలెడ్జ్ అంశాలను పిల్లలకి వివరించారు.

వైభవంగా రథోత్సవం

ముదినేపల్లి రూరల్: రెండో పూరీగా ప్రసిద్ధి చెందిన వడాలి శ్రీజగన్నాథస్వామి ఆలయ కల్యాణోత్సవాల్లో భాగంగా సోమవారం రథోత్సవం జరిగింది. స్వామి, అమ్మవార్ల విగ్రహాలను రథంపైకి చేర్చి పూజలు నిర్వహించి రథయాత్ర ప్రారంభించారు. బాణాసంచా, వివిధ విచిత్ర వేషధారణల నడుమ గ్రామంలోని వీధుల్లో రథోత్సవం నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి స్వామివారికి పవళింపు సేవ నిర్వహిస్తామని ఈఓ శింగనపల్లి శ్రీనివాసరావు తెలిపారు.



సాయిబాబాకు ప్రత్యేక పూజలు

పమిడిముక్కల: కృష్ణాపురం గ్రామంలో సాయిబాబా ఆలయం 18వ వార్షికోత్సవాల్లో భాగంగా సోమవారం సాయిబాబాకు ప్రత్యేక అలంకరణ చేసి విశేషంగా పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గొడపాలెంలో జరిగిన యార్లగడ్డ వారి అంకమ్మ తల్లి సంబరంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ అధ్యక్షుడు యార్లగడ్డ రామగోపాల్, నాయకులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



కైకలూరు: వేసవి సెలవుల్లో యువకుల్లో క్రీడా స్ఫూర్తిని నింపడానికి ఆచవరం గ్రామంలో బీఎస్సార్, ఎస్వై పేరుతో మెగా టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్‌ను బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బూరుబోయిన శ్రీనివాసరావు(బీఎస్సార్), నీలపాల నరేష్ యాదవ్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ నియోజకవర్గ స్థాయిలో మొత్తం 40 జట్లు పోటీ పడతాయని తెలిపారు. ఎనిమిది ఓవర్లకు పోటీ ఉంటుందన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ. 25 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు అందిస్తామని పేర్కొన్నారు. ప్రారంభం రోజున చావలిపాడు - మండవల్లి జట్ల మధ్య జరిగిన పోటీ డ్రాగా ముగిసింది. కార్యక్రమంలో నిర్వాహకులు బీ అనిల్, బీ ప్రసాద్, గ్రామస్తులు పాల్గొన్నారు.

కాపునాడు లీగల్ సెల్ పార్లమెంట్ అధ్యక్షుడిగా చింతా



చింతా రత్నశేఖరరావు

గుడివాడరూరల్: రాష్ట్ర కాపునాడు మచిలీపట్నం పార్లమెంట్ లీగల్‌సెల్ అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన ప్రముఖ న్యాయవాది చింతా రత్నశేఖరరావును నియమిస్తూ లీగల్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మల్లెమూడి సతీష్ బాబు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. యువ న్యాయవాది, వివిధ కాపు సంఘాల్లో చురుగ్గా పని చేసిన అనుభవం కలిగిన చింతాను లీగల్ సెల్ అధ్యక్షుడిగా నియమించడంపై పలువురు కాపు ప్రముఖులు, న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చింతా మాట్లాడుతూ తనకు అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించి సమాజానికి, కాపుజాతికి మంచి పేరు తీసుకువస్తానని తెలిపారు.